బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొత్స సత్యనారాయణ తదితరులు

వైద్య ఆరోగ్యశాఖలో అయోమయం

కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరిగాయంటే గొప్ప పారదర్శకమని అందరికీ నమ్మకం. బదిలీ చేసిన తర్వాత రిలీవ్ చేయడం, పోస్టింగ్ ఇవ్వడం అన్ని ప్రభుత్వశాఖల్లో జరిగేదే. కానీ, వైద్య ఆరోగ్యశాఖలో ఇందుకు భిన్నంగా ఈ ప్రక్రియ నడుస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత నెల 17 నుంచి 19 వరకు జోనల్ పరిధిలో చేపట్టిన బదిలీల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొంత మంది ఉద్యోగులకు బదిలీ చేసినా ఇప్పటివరకు వారికి పోస్టింగ్ ఇవ్వకపోవడంతో వారిలో అయోమయం నెలకొంది. ఐటిడిఎ పిఒల వైఖరితో పాత స్థానాల్లో పని చేయలేక, కొత్త ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

డిఎంహెచ్ఎఒ కార్యాలయం వద్ద కౌన్సెలింగ్‌లో పాల్గొన్న

- **నిలిచిన పలువురు బదిలీలు**
- **ఐటిడిఎ పిఒల అభ్యంతరాలతో నిలిచిన వైనం**
- **పట్టించుకోని ప్రభుత్వం**
- **పోస్టింగ్‌లు ఇవ్వకుండా జాప్యం చేయడంపై ఉద్యోగుల్లో ఆందోళన**

వైద్య ఆరోగ్యశాఖలో 25 రకాల కేడర్‌ల్లో పని చేస్తున్న ఉద్యోగులకు జోనల్ స్థాయిలో గత నెల 17 నుంచి 19 వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో పరిధిలో సుమారు 220 మంది ఉద్యోగులకు బదిలీ చేశారు. వీరిలో రంపచోడవరం, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలోని పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న 39 మంది మినహా అందరూ బదిలీ అయిన కొత్త స్థానాల్లో చేరిపోయారు. ఐటిడిఎ పరిధిలోని పిహెచ్‌సిలకు కొత్త వారు చేరే వరకు వీరిని రిలీవ్ చేయకూడదని ప్రాజెక్టు ఆఫీసర్లు నిర్ణయించడంతో వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ రిలీవ్ చేయాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు.

తాము కొత్త స్థానాలకు వెళ్లేవరకు పాత పిహెచ్‌సిల్లోనే పనిచేస్తామని, కొత్త స్థానాల్లో ఎవరినీ నియమించవద్దంటూ అధికారులు విన్నవించుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. దీనిపై విశాఖలోని వైద్య ఆరోగ్య సేవల ప్రాంతీయ సంచాలకులు డా రాధారాణి బదిలీ అయిన ఉద్యోగులకు వెంటనే రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వాలంటూ గత నెల 23న ఐటిడిఎ పిఒలకు లేఖ రాశారు. కొత్త వారు విధుల్లో చేరే వరకు వార పాత స్థానాల్లోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వేతనాలు, సర్వీస్ కొనసాగింపు తదితర సమస్యలు తలెత్తకుండా చూడాలని విన్నవించారు.

ఐటిడిఎ పిఒల తీరుపై విమర్శలు

వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల బదిలీల్లో ఐటిడిఎ పిఒల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే బదిలీలు చేపట్టినా ఐటిడిఎ అధికారులు వారికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా నాన్చివేత ధోరణి ప్రదర్శించడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు. విశాఖలోని వైద్య ఆరోగ్య సేవల ప్రాంతీయ సంచాలకులు దీనిపై లేఖ రాసినా పిఒలు పట్టించుకోకపోవడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారమే బదిలీ చేసినప్పుడు పిఒలకు అభ్యంతరమేమిటని వారు అంటున్నారు. ఏదైన సమస్య ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలి తప్ప ఏజెన్సీ ప్రాంత నిబంధనల సాకుతో బదిలీ అయిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీ దరఖాస్తుల్లో గిరిజన ప్రాంతాల ఆప్షనే లేనప్పుడు, కౌన్సెలింగ్ ద్వారా చేపట్టిన బదిలీలను ఎలా ఆపుతారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై అనుమానాలు

ఐటిడిఎ పిఒల అభ్యంతరాల పేరుతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కలెక్టర్లను తప్పుదారి పట్టిస్తున్నారంటూ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగుల నుంచి ఎఒ ఆశించే తాత్సరం చేస్తున్నారని అనుమానిస్తున్నారు. బదిలీల్లో తమకు కేటాయించిన ప్రాంతంలో వేరెవరికయినా పోస్టింగ్ ఇచ్చేస్తారేమోనన్న భయమూ వారిని వెంటాడుతోంది. ఈ విషయంలో అటు ప్రభుత్వం గాని, ప్రజా ప్రతినిధులు గాని ఎవరూ పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య ఆరోగ్య సేవలపై ప్రభావం

సహజ విధానాలకు అనుగుణంగానే ప్రభుత్వ బదిలీ చేసినా ఐటిడిఎ పిఒలు దానిని అమలు చేయకపోయినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బదిలీలను ఆపేయడంతో ఆయా పిహెచ్‌సిల్లో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల బారిన పడివారితో పిహెచ్‌సిలు కిటకిటలాడుతున్నాయి. బదిలీ అయిన ఉద్యోగులు చేరలేకపోవడంతో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రజల్లోకి చంద్రబాబు మోసాలు

- **రీకాల్ మేనిఫెస్టోను విస్తృతంగా తీసుకువెళ్లాలి**
- **శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ**

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి ఎగొట్టిన చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ప్రయివేటు హోటల్‌లో గురువారం నిర్వహించిన వైసిపి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు, మహిళలను మోసం చేయడం చంద్రబాబుగా అలవాటుగా మారిందన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సమిష్టిగా హామీలిచ్చి వాటిని త్రికరణ శుద్ధిగా అమలు చేస్తామంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల సంతకాలతో బాండ్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఏడాదైనా యువతకు నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 హామీ ఏమైందని ప్రశ్నించారు. చంద్రబాబు వంద అబద్దాలు ఆడితే... లోకేష్ 200 అబద్ధాలు చెప్తున్నారని విమర్శించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఏప్రిల్, మే నెలల్లో ఇస్తామని శాసనమండలిలో లోకేష్ ప్రమాణం చేసినా దానినీ అమలు చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై అడుగుతున్న వారిని తాట తీస్తాం, తోకలు కత్తిరిస్తామంటూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని చెప్పారు. కేసులు, అరెస్టులు వంటి తాటాకు చప్పుళ్లకు వైసిపి శ్రేణులు భయపడవని స్పష్టం చేశారు. జిల్లాకు చెందిన యువకుడు కేంద్రమంత్రి అయితే జిల్లా ఏదో అభివృద్ధి చెందిపోతుందని అంతా అనుకుంటే పౌర విమానయానశాఖ మంత్రిగా రామ్మోహన్‌నాయుడు ఏమీ చేయలేకపోతున్నారని విమర్శించారు. విశాఖలో ఒక వైపు విమాన సర్వీసులకు కోత పెడుతుంటే, కర్నూల్‌లో విమానాలు తిప్పేస్తానంటూ రామ్మోహన్‌నాయుడు చెప్తున్నారంటూ ఎద్దేవా చేశారు. తొలి అడుగు పేరుతో టిడిపి నాయకులు అందరి ఇళ్లకు వెళ్లే ధైర్యం లేదన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏవిధంగా మోసం చేశారో ప్రజలకు వివరించేందుకే రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో నాయకులు ఎటువంటి అలసత్వం ప్రదర్శించొద్దని హితవుపలికారు.

డైవర్షన్ రాజకీయాలు: కురసాల కన్నబాబు

పార్టీ ప్రాంతీయ సమన్వకర్త కురసాల కన్నబాబు మాట్లాడుతూ జగన్ పథకాలను కాపీ కొట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయడంలో మాత్రం ప్రజలను వంచించారని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో పింఛన్లపై కోత... విద్యుత్ బిల్లులతో వాత పెట్టిందన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరించి చైతన్య పరుస్తామని చెప్పారు. చంద్రబాబు, లోకేష్ జిల్లాకూ అనేక హామీలు ఇచ్చారని వాటినీ అమలు చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై అడుగుతుంటే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. లోకేష్ రెడ్‌బుక్‌కు భయపడేవారెవరూ లేరని అన్నారు. రాష్ట్రంలో రెండే పథకాలు అమలవుతున్నాయని, అవి చంద్రన్న దగా... చంద్రన్న పగ అని ఆయన చెప్పారు.

బాబు మేనిఫెస్టో మోసాలు : రవిబాబు

పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్త కుంభా రవిబాబు మాట్లాడుతూ రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రతి ఇంటికీ తీసుకువెళ్లాలన్నారు. దేశ రాజకీయాల్లో ఇటువంటి కార్యక్రమాన్ని మరే రాజకీయ పార్టీ చేపట్టలేదని చెప్పారు. నియోజకవర్గాలు, మండలాలు, గ్రామస్థాయిలో సమావేశాలను నిర్వహించి ప్రజల్లోకి మేనిఫెస్టో మోసాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నేతలు తమ్మినేని సీతారాం, డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, చింతాడ రవికుమార్, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, పేరాడ తిలక్, పిరియా సాయిరాజ్, మామిడి శ్రీకాంత్, ఎం.వి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే విత్తనాలు, ఎరువుల పంపిణీ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రైతులకు విత్తనాలు, ఎరువులు సత్వరమే పంపిణీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. రైతులకు విత్తనాల సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. వరి విత్తనాలు పంపిణీ గురించి వ్యవసాయశాఖ జెడిని అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్‌లో ముఖ్య పంటైన వరి 33,622 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు 1520 క్వింటాళ్ల పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వెయ్యి పచ్చిరొట్ట విత్తన కిట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. యూరియా, డిఎపి, తదితర ఎరువులు ఖరీఫ్ సీజన్ నిమిత్తం 69.05 మెట్రిక్ టన్నులు కావాల్సిన అవసరం ఉందని, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా, డిఎపి వంటి ఎరువులు 13,495 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. రైతులు అవసరాల నిమిత్తం ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. మండలాల నుంచి అవసరమైన ఎరువుల అవసరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల నుంచి 2500 మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని ప్రతిపాదనలు వచ్చినట్లు చెప్పారు. జిల్లాకు 38 రైతు డ్రోన్ల ఎఫ్ఎంబిలు గ్రౌండింగ్ లక్ష్యంగా పెట్టుకోగా, వీటిలో 31 సిహెచ్‌సి గ్రూపులకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేశామని వివరించారు. ప్రస్తుతానికి పది సిహెచ్‌సి గ్రూపులు తమ 50 శాతం వాటాను జమ చేసినట్లు జెడి వివరించారు. మూడు సిహెచ్‌సి గ్రూపులకు డ్రోన్లు సరఫరా చేశామన్నారు. ప్రతి డ్రోన్ గ్రూప్‌నకూ 80 శాతం సబ్సిడీ వర్తిస్తుందని వెల్లడించారు. జిల్లాలో డ్రోన్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. గతేడాది ఎన్ని మండలాల్లో డ్రోన్లను వియోగించారో ఆ వివరాలు అందించాలని ఆదేశించారు. 2.09 కోట్ల రాయితీపై యాంత్రీకరణ పరికరాలు రైతులకు పంపిణీ చేశామని జెడి వెల్లడించారు. పొలం పిలుస్తోంది ఇప్పటికే ప్రారంభించినట్లు చెప్పారు. గార మండలాల్లో ఏరియా యాక్షన్ ప్లాన్ గత యేడాది వివరాలను రైతులను అడిగి తీసుకోవాలన్నారు. సజ్జలు, మొన్నజొన్న, రాగి, అపరాలు, వేరుశనగ, నువ్వులు, పత్తి, గోగునార, చెరకు రైతులకు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ జెడి కలెక్టర్‌కు వివరించారు. ఎపిఎంఐపి ఉప సంచాలకులు శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జెడి కె.రాజగోపాల్, మత్స్యశాఖ ఉప సంచాలకులు సత్యనారాయణ కలెక్టర్‌కు నివేదిక అందించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

కార్మిక, కర్షక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలనే తదితర డిమాండ్లతో ఈ నెల 9న నిర్వహించనున్న జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక, కర్షక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని క్రాంతి భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల జిల్లాస్థాయి సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని కోరారు. రైతుల, వ్యవసాయ కార్మికుల, రైతుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ రైతు పెట్టుబడి సహాయం రూ.20 వేలు వెంటనే విడుదల చేయలన్నారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. సుప్రిం కోర్టు ఆదేశం మేరకు కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్లు అమలు వల్ల కార్మికవర్గ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని, వెట్టిచాకిరీకి, బానిస విధానానికి కార్మిక లోకం బలైపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ దేశ వ్యాప్త సమ్మె భారత ప్రభుత్వానికి ఒక కనువిప్పు కలిగేలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ 200 రోజులకు, రోజువారి కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలన్నారు. సెకీ, యాక్సిస్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు.

నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల వృత్తిదారుల హక్కులు కాపాడాలన్నారు. ధాన్యం, జీడి, కొక్, శనగ, మినుములు వగైరా పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కేటాయించి, కొనుగోలు చేయలన్నారు. కార్మికులు తమ పోరాటాల సాధించిన హక్కులు, చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని, కార్మిక వర్గం తమ శక్తిని ఈ సమ్మె ద్వారా చాటాలని కోరారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ ప్రయోజనాల అనుకూల చట్టాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా సమ్మె పురస్కరించుకొని గ్రామ, మండల, డివిజన్ కేంద్రాల్లో నిరసన, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్, కె.మోహనరావు, పోలాకి ప్రసాదరావు, పి.తేజేశ్వరరావు, పొందూరు. చంద్రరావు, పి.పోలారావు, డి.కృష్ణారావు, సాధు లక్ష్మీనారాయణ, బొత్స సంతోష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రకాష్

మానవత్వం ఉండాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మానవత్వం లేని వ్యక్తి రాష్ట్ర రాజకీయాల్లో ఉండే అర్హత లేదని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని చాకిపల్లిలో సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ కూటమి ప్రభుత్వం అమలు చేసినవి, వచ్చే నాలుగేళ్లలో చేయనున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యం రూ.1700 కోట్లు బకాయి పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రూ.12,500 కోట్లతో రైతులు నుంచి కొని 24గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిందన్నారు. మూడు లక్షల పింఛన్లు తొలగించారని పేర్కొన్నారు. రాష్ట్రం అప్పుల పాలు చేశారని, చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత ఏడాదిలో గాడి పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి రావు, పంగ తవిటియ్య, పంగ వసంతకుమార్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఐఐహెచ్‌టిలో స్పాట్ అడ్మిషన్లు

జిల్లా చేనేత వస్త్రాల అధికారి జనార్ధనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఐఐహెచ్‌టిలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత వస్త్రాలు అధికారి టి.జనార్ధనరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ, వెంకటగిరి, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యాన నడుముదున్న సంస్థ అని తెలిపారు. ఇది 1992లో ప్రారంభించిన ఈ సంస్థలో హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ టెన్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ వారిచే ధ్రువపత్రాల జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంస్థలో దక్షణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు వివరించారు. దేశంలోని 11 హ్యాండ్ లూమ్ ఇనిస్టిట్యూట్స్‌లో వెంకటగిరి ఇనిస్టిట్యూట్ ఒకటి. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వారి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఇంటర్మీడియట్ ఎంపిసి, పాలిటెక్నిక్ డిప్లమా ఉత్తీర్ణులైన నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చునని తెలిపారు. ఈ కోర్సు చదివేవారందరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు స్టైఫండ్ నెలకు రూ.2,500 పొందుటకు అర్హులన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వెంటనే క్యాంపస్ సెలెక్షన్స్ ద్వారా అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. చేనేత, జౌళి శాఖకు సంబంధించిన ప్రభుత్వ ఉద్యోగాలకు వీరికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదుగేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఉన్నత చదువులు చదవాలనుకున్న వారు ఈ కోర్సు చేసిన తరువాత నేరుగా రెండో సంవత్సరం బిటెక్‌లో ప్రవేశించవచ్చునన్నారు. ఆగస్టు 1లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కాలేజీ వెబ్‌సైట్ www.ihtygr.com సందర్శించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9866169908, 9010243054 సంప్రదించాలని చెప్పారు.

కుదిరిన వేతన ఒప్పందం

ప్రజాశక్తి- మందస

గతేడాది మే నెల నుంచి చేపట్టాల్సిన జీడి కార్మికుల వేతన ఒప్పందం యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతోపాటు 41 రోజులు పని ఇవ్వకుండా కార్మికులకు ఇబ్బందులకు గురి చేశారు. గత 14 నెలలుగా సుధీర్ఘ కాలం పాటు సిఐటియు ఆధ్వర్యాన అనేక ఆందోళనలు, పోరాటాలు సాగించారు. మండలంలో ధర్నాలు చేశారు. లేబర్ అధికారులకు వినతిపత్రాలనూ అందజేశారు. లేబర్ అధికారులు జోక్యం చేసుకొని చర్చిందుకు చర్యలు తీసుకున్నారు. పలు దఫాలు చర్చించారు. చివరకు గురువారం కార్మికులకు, యాజమాన్యాలకు మధ్య వేతన ఒప్పందం ఒక కొలిక్కి వచ్చింది. గతంలో ఇస్తున్న వేతనాలకు రూ.2.50 పైసలు కేజీకి పెరుగుదలతో ఒప్పొందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం కాల పరిమితి రెండేళ్ల వరకు అమలులో ఉంటుందని కార్మిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.గణపతి, కె.కేశవరావు, బి.దుర్యోధన, పి.కూర్మారావు, జీడి కార్మికుల సంఘం నాయకులు సిహెచ్.చంద్రావతి, అల్లు హేమలత, సిహెచ్.జానకమ్మ, కె.శాంతమ్మ, కె.ధనము, కుమారి, పరిశ్రమ యాజమనులు జె.ప్రసాదరావు, ఐ.కేశవరావు, మద్ది శివ, మద్ది రమణమూర్తి, మార్కండేశ్వరరావు పాల్గొన్నారు. పోరాటానికి సహకరించిన అందరికీ కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.

పనికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కార్మికులు

వరి పంటకు బీమా చేసుకోవాలి

ప్రభుత్వ విప్ అశోక్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

నూటికి నూరు శాతం వరి బీమా చేయించుకోవాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన ప్రత్యేక పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీమా అంటేనే ఓ భరోసా అని అన్నారు. ప్రతి రైతన్న దీన్ని వినియోగించుకోవాలని అన్నారు. వ్యవసాయశాఖ రైతు సేవా కేంద్రాల ద్వారా ఇంటింటికీ వెళ్లి బీమా వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు బి.నరసింహమూర్తి, శ్రీదేవి, సురేష్ మాట్లాడుతూ పంట రుణం తీసుకున్న రైతులు కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవలని సూచించారు. ఖరీఫ్ 2025లో వరి పంటకు ప్రకృతి విపత్తుల కారణంగా దిగుబడులు తగ్గితే ఒక్క ఎకరానికి రూ.40వేల వరకూ పరిహారం అందుతుందని తెలిపారు. రుణగ్రహీత రైతులకు బ్యాంకే నేరుగా బీమా చెల్లిస్తుందని, రైతులు ఆధార్, అడంగల్, పంట ధ్రువీకరణ పత్రంతో ఆగస్టు 15 తేదీలోపు బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, సదానంద రౌళో, వ్యవసాయ విస్తరణ అధికారి బెందాళం శ్రీకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికరంగా సేవలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజల సంతృప్తే ప్రభుత్వ పాలనకు ప్రామాణికమని, అందుకే ప్రతిశాఖా ప్రజల అభిప్రాయాలను నిక్షిప్తంగా గుర్తించి, సేవలను మరింత మెరుగుపరిచే దిశగా పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధ్యక్షతన వెలగపూడి సచివాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ జిల్లా నుంచి ఆయా శాఖల అధికారులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఎం సూర్య ఘర్, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, బంగారు కుటుంబం వంటి కార్యక్రమాల అమలు, ప్రజల్లో సానుకూల ధోరణి పెంపొందించడంపై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిశాఖా ప్రజలకు సేవలందించే విధానం ఆత్మవిశ్వాసంతో ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతిశాఖా తమ శాఖా పనితీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో మరింత సానుకూల స్పందన రావాలంటే అధికారులు మరింత చురుగ్గా, బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఎ, సివిల్ సప్లయి, ఆరోగ్యశాఖ, ఆర్‌టిసి, మున్సిపాలిటీ, ల్యాండ్ అండ్ సర్వే, అన్న కేంటీన్లు, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

NAME CHANGE

నేను **BAIREDLA SURESH, S/o BAIREDLA SESHAYYA,** గొండ్యాలపుట్టుగ గ్రామం, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532322. నేను గత 15 సంవత్సరాలుగా **ARMY**లో ఉద్యోగం చేస్తు ప్రస్తుతం **HAV**గా విధులు నిర్వహిస్తున్నాను. నా రికార్డ్స్ సరి చేసుకోవడం కోసం నా యొక్క భార్య ఇంటి పేరు **TADAKA JYOTHI** నుండి **BAIREDLA JYOTHI**గా మారుస్తున్నట్లు మరియు నా తల్లి పేరు **BAIREDLA SUSELA** నుండి **BAIREDLA SUSHEELA**గా పుట్టిన సంవత్సరం 14-9-1960 నుండి 14-9-1961గా సరిచేసుకుంటూ తప్పులు లేకుండా సరిచేయించుకున్నాను అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాను.

వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలను ప్రజలు వచ్చి వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాల్లో అసంపూర్తిగా నిలిపోయిన అంగన్వాడీ భవనాలు పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం వితంతు పింఛన్లు నిలిపివేసిందని, వాటిని మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, చౌదరి బాబ్జి, నాలుగు మండలాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు సమస్య వివరిస్తున్న విజయకృష్ణ

న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

తమ పట్టాదారు పాసు పుస్తకాల్లో ఉన్న, తమకు వారసత్వంగా వస్తున్న విస్తీర్ణం కాకుండా ఆన్‌లైన్‌లో సున్నా విస్తీర్ణం కనిపిస్తోందని, అలాగే తమ భూమి వివరాలు నోషనల్ ఖాతాల (ప్రభుత్వ ఖాతా)కు జమ అవ్వడంతో తమకు 1 బి, అడంగల్ పత్రాలు రాకపోవడమే కాకుండా ఎటువంటి భూ సంబంధ రుణాలు పొందే అవకాశం కోల్పోతున్నామని పలువురు రైతులు వాపోయారు. ఈ మేరకు గురువారం కవిటి వచ్చిన ఆర్‌డిఒ వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం రైతుల ప్రతినిధి, ఎంపిటిసి సభ్యులు బెందాళం విజయకృష్ణ మాట్లాడుతూ బొరివంక, లోళ్లపుట్టుగ, బి.జి.పుట్టుగ, ఇద్దివానిపాలెం గ్రామాలకు చెందిన 17 మంది రైతుల భూమి వివరాలు సున్నా విస్తీర్ణం చూపిస్తుండగా, 208 మంది రైతుల జిరాయితీ భూముల వివరాలు రైతుల వాస్తవ ఖాతాలకు బదులు ప్రభుత్వ ఖాతాకు (నోషనల్ ఖాతాకు) జమ అవడంతో రైతులు చాలా నష్టపోతున్నట్లు తెలిపారు. మొత్తంగా 225 మంది రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని సున్నా విస్తీర్ణం, నోషనల్ ఖాతాలు సరిచేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆర్‌డిఒ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తానని తెలిపారు. అదే సమయంలో తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ట్రిపుల్ ఐటి, ఐటిఐ ప్రవేశాల కోర్సులో కోల్పోయిన ఇద్దరు బెంతు ఒరియా విద్యార్థుల సమస్యను విజయకృష్ణ, బెంతు ఒరియా ప్రతినిధి సుమన్ బిసాయి ఆర్‌డిఒ దృష్టి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ సంబంధిత కాలేజీల యాజమాన్యంతో మాట్లాడారు. వారి చదువుకు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీమోహన్, డిటి కృష్ణమూర్తి, విఆర్‌ఒలు దివాకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇఇ మురళీమోహన్

తాగునీటి పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో తాగునీటి సరఫరాలో పరీక్షలు నిర్వహించాలని గ్రామీణ నీటి సరఫరా డిప్యూటీ ఇఇ మురళీమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రామారావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో తాగునీరు పరీక్షలు నిర్వహించి సరఫరా చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వెచ్చ సంతోష్ మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట వైద్య పరీక్షలు చేయాలని పారిశుధ్య మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎఒ కె.విష్ణుమూర్తి ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెంకటాచలం

పాలిథిన్ వినియోగం నిషేధించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాలిథిన్ వినియోగం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించగలమని కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి అన్నారు. పాఠశాల ఆవరణలో వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యాన అంతర్జాతీయ పాలిథిన్ బ్యాగ్ నివారణా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా వినియోగదారుల క్లబ్‌ల మాస్టర్ ట్రైనర్ వెంకటాచలం క్లబ్ విద్యార్థులతో పాలిథిన్ వినియోగంపైన వాటి నష్టాలు ప్రత్యామ్నాయ అవకాశాల గురించి చెప్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల ఆవరణ, విద్యార్థులు ఇంటిలో పాలిథిన్ నివారణాకు ప్రణాళికని తయారు చేశారు. అనంతరం పాఠశాలలో పాలిథిన్ వినియోగం లేకుండా చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.గోపాలకృష్ణ, పి.రామారావు, ఎస్.దాస్, టి.యతిరాజారావు, సిహెచ్.ఆదినారాయణ, ప్రమీల, పుష్పలత, నారాయణరావు, బోధనేతర సిబ్బంది సింహాచలం, పుష్పకుమారి, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్స్ డే

నరసన్నపేట : మండల కేంద్రంలో టు వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఘనంగా మెకానిక్స్ డేను గురువారం నిర్వహించారు. టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు కుప్పిలి సోమేశ్వరరావు గురువారం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పట్టణ టు వీలర్ బైక్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రపంచ మెకానికుల దినోత్సవం సందర్భంగా విజయ దుర్గా వర్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెకానిక్ షెడ్ వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రరావు, భాస్కరరావు, ఎన్.వెంకటరమణ, రమేష్ పాల్గొన్నారు.

కొమ్మువలసపై కనికరం లేదా...?

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతాం, ఆరోగ్యవంతమైన వాతావరణం సృష్టిస్తాం. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో ఆయా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అనునిత్యం అవస్థలు తప్పడం లేదు.

బావి చుట్టూ అపారిశుధ్యం

- కంపు కొడుతున్న గ్రామం
- డ్రెయినేజీలు లేని వైనం
- తాగునీరు గగనం
- పట్టించుకోని యంత్రాంగం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తోటవాడ పంచాయతీ పరిధిలో ఉన్న కొమ్మువలస గ్రామంలో సమస్యలు గ్రామీణ ప్రజలకు తీవ్రంగా వేధిస్తున్నాయి. దశాబ్దాల కాలంగా ఈ గ్రామంలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర అవస్తలు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో ఉన్న ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వంలో ఇంటింటా కొళాయిలు ఏర్పాటు చేసేందుకు పైపులైన్ వేసి వదిలేసారని గ్రామస్తులు వాపోతున్నారు. అయితే గ్రామంలో ఉన్న పురాతన భావి నీరే అన్ని అవసరాలకు వినియోగిస్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తాగునీటి అవసరాన్ని తీసుకునేందుకు ఒకే ఒక్కబోరు మాత్రమే ఉందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక పోయినా కూటమి ప్రభుత్వంలోనైనా తమకు మౌలిక వసతులు కలుగుతాయని ఆశపడ్డామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లుపై ఆవులు కట్టడంతో అపారిశుధ్యంగా ఉన్న గ్రామ రహదారి

రోడ్లు పైన మురుగునీరు

గ్రామంలో ఏ వీధిలోనూ డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరంతా వీధి మధ్యలో రహదారిపై నిల్వ ఉండడంతో దీనివలన అపారిశుధ్యం నెలకొని వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

అధ్వానంగా రహదారి....

గ్రామంలో ఏ వీధిలోనూ సరైన రహదారి లేవని, ఉన్న రహదారులు కూడా పూర్తిగా శిధిలావస్థకు చేరుకున్నాయని, గ్రామంలో ఉన్న సమస్యలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోపోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో అవసరమైన ప్రజలకు తాగునీరు, డ్రైనేజీలు, రహదారులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం

గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడం వలన మురుగునీరు వీధి మధ్యలోనే నిల్వ ఉండిపోతుంది. దుర్గంధం భరించలేక పోతున్నాం. వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. అధికారులు డ్రైనేజీలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

- చీర రాజేశ్వరి, కొమ్మువలస

తాగునీరు గగనమే

తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు గురవుతున్నాం. కొళాయిలు, పైపులైను వేసి విడిచి పెట్టేశారు. రహదారి సౌకర్యం లేదు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలి.

- నునగుప్పల పార్వతి, కొమ్మువలస

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ పరిశ్రమ వద్ద సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ గేట్ మీటింగ్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9న సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు కార్మిక వర్గం పోరాడి అశేష త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో నాగార్జున అగ్రికం వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.రామప్పుడు, మాన్యం రమణ, నాగార్జున అగ్రికం స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అంబటి సత్యనారాయణ, ఆర్.గణపతిరావు, సుధాకర్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు అన్నారు. మార్కెట్ కమిటీ యార్డులో సిఐటియు మండల కమిటీ కన్వీనర్ పంచాది లతాదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకుడు కె.తారకేశ్వరరావు, తపాలా విభాగం నాయకులు బి.శ్రీరామ్మూర్తి, జన విజ్ఞాన వేదిక నాయకులు షణ్ముఖరావు, మున్సిపల్ యూనియన్ నాయకుడు తాడి సంతోష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.భూలక్ష్మి, ఎస్.కనకం, జె.జ్యోతి, డి.అరుణ, జి.భారతి, వి.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

గేట్ ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రైవేట్ స్కూళ్ల బంద్ సంపూర్ణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రైవేట్ స్కూళ్ల రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు గురువారం బంద్ నిర్వహించారు. ఈ మేరకు ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్లకు బుధవారం రాత్రి మెసేజ్‌లు పెట్టారు. ప్రైవేట్ పాఠశాలలు మూసివేశారు. బస్సులు సైతం నిలిపివేశారు. అధికారులు ఏకపక్ష నిర్ణయాలు, అధికారుల వేధింపులు, విద్యా హక్కుచట్టం ప్రవేశాలపై బలవంతం, విద్యాహక్కు చట్టం ప్రవేశాలల్లో పక్షపాత ధోరణి, కొన్ని పాఠశాలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, గుర్తింపు రద్దు బెదిరింపులు, వంటి అంశాలను వ్యతిరేకిస్తూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బంద్ ప్రకటించాయి. భవిష్యత్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఐక్యతగా ముందుకు సాగుతామని జిల్లా ప్రైవేట్ స్కూళ్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బి.లక్ష్మణరావు తెలిపారు.

ఆర్‌జియుకెటిలో రెండో రోజు అడ్మిషన్లు

ఎచ్చెర్ల: ఆర్‌జియుకెటి పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు 2025-26 సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నూజివీడు ఎస్ఎసి ఆడిటోరియంలో 3న రెండు రోజుల శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 547 మందికి కాల్ లెటర్స్ పంపించారు. అడ్మిషన్ పొందిన 429 మంది విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. రెండురోజుల కౌన్సిలింగ్ ప్రశాంతంగా జరగడంపై శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య కెవిజిడి బాలాజీ సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం అడ్మిషన్ల ప్రక్రియను ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. ఎఒ ముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ రవి గేదెల, మోహన్ కృష్ణ చౌదరి, కో- ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విస్తృత దాడులు

పలాస: పలాస రైల్వేస్టేషన్‌లో మాదక ద్రవ్యాలు గంజాయి, కొకైయిన్ అక్రమ రవాణాలపై కాశీబుగ్గ లోకల్, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ పోలీసులు గురువారం పలాస నుంచి అమదాలవలస వరకు వెళ్తున్న రైలుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని సిఐ టి.సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నందిగాం : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యపడుతుందని నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.గాయత్రి అన్నారు. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు అవగాహన కల్పించి అనంతరం వైద్యశాల అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు సరఫరా చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మంజుల, సిహెచ్ఒ దాతారావు, ఎఎన్ఎం దేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మికలో జ్వరాలు

- పారిశుధ్య పనులు చేపట్టిన అధికారులు
- గ్రామంలో వైద్య శిబిరం

గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో ఉన్న బొమ్మిక గిరిజన గ్రామంలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బూర్జ పిహెచ్‌సి ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. మరో రెండు రోజుల పాటు గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం జ్వరాలు అదుపులో ఉన్నాయని, వాతావరణంలో మార్పుల వలన జ్వరాలు వస్తున్నాయని ఎంఎల్ హెచ్‌పి శ్రీకావ్య శ్రీ తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి కళ్యాణ్ బాబు గ్రామంలో ఉన్న కాలువల్లో పూడికలు తీయించి మలాథియన్ స్ప్రేయింగ్ పిచికారి చేపట్టారు. గ్రామంలో అన్ని వీధుల్లో బ్లీచింగ్ జల్లించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ సరోజిని, సిహెచ్ఒ మురళి, ఎఎన్ఎం రమణమ్మ, ఆదిలక్ష్మి, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా ఆక్రమణ తొలగింపు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి గోపీనాథపురం వద్ద ఉన్న చెరువుకు సాగునీరు అందిస్తూ... ఈ ప్రాంతంలోని పొలాలకు సాగునీరందించే వంశధార కాలువ ఆక్రమణ తొలగింపు వివాదాస్పదంగా మారింది. 48ఆర్ వంశధార మెయిన్ కెనాల్ నుంచి స్థానిక మెళియాపుట్టి కూడలి మీదుగా చేరీ వీధి పొలాల నుంచి తెలుగు బ్రాహ్మణవీధి, తెలుకల వీధిల మీదుగా సాగునీటి కాలువ ఉండేంది. వీటి ద్వారా గోపినాథపురం చెరువుకు సాగునీరు అందించేవారు. అయితే కొద్ది నెలల క్రితం తెలుకల వీధి ప్రాంతం వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి వంశధార కాలువని ఆక్రమించుకుని వెంచర్ వేశారు. గోపీనాథపురం ప్రాంతానికి చెందిన రైతులు రెవెన్యూ, వంశధార అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు కాలువ ఆక్రమణలను పరిశీలించిన వంశధార ఇఇ శేఖర్‌బాబు ఆక్రమిత స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడే ఉన్న ఒక ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం కూడా కాలువని ఆక్రమించుకుని కట్టడాన్ని గుర్తించారు. ఈ మేరకు ఆక్రమణలు తొలగింపులో భాగంగా ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాన్ని చెందిన ప్రహరీగోడని కూల్చివేశారు. దీనిపై సంబంధిత స్థలదారులకు, వంశధార అధికారుల మధ్య తలెత్తిన వివాదం పోలీసు కేసు వరకు దారితీసింది. అయితే గోపీనాథపురం ప్రాంతానికి చెందిన చెరువుకు నీరు ప్రవహించే కాలువపై అనేక చోట్ల పక్కా నిర్మాణాలు చోటుచేసుకున్నాయి. వాటిపై దృష్టి సారించకుండా వంశధార అధికారులు ఇక్కడే ఆక్రమణలు ఉన్నాయని గుర్తించి వాటిని తొలగించడంలో ఎందుకు ఉత్సాహన్ని చూపుతున్నారని రైతులు అంటున్నారు. ఆక్రమణల మొత్తం తొలగించి కాలువలో పూడికతీత పనులు చేపట్టి గోపినాథపురం ప్రాంతానికి చెందిన చెరువుకు సాగునీరందించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో వంశధార అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

వైసిపి అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

జన రంజక పాలన కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని టిడిపి కార్యకర్తలు తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిశీలకులు రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు ఆధ్వర్యంలో టిడిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఏడాది పాలనలో గ్రామాల్లో రహదారులు, తల్లికి వందనం, పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రజలకు అందజేసి ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకుందన్నారు. ఈ సందర్భంగా మండల టిడిపి కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎన్నుకొన్నారు. టిడిపి మండల అధ్యక్షుడిగా కనుగులవలస సర్పంచ్ నూక అప్పలసూరనాయుడు (రాజు)ను ఎన్నుకోవడంతో పాటు మిగతా కార్యవర్గాన్ని ఎన్నిక చేసి ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళ అధ్యక్షులు తమ్మినేని సుజాత, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, దూసి నీటి సంఘం అధ్యక్షులు హనుమంతు బాలకృష్ణ, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీపతిరావు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రికార్డులు స్వాధీనం

ప్రజాశక్తి- టెక్కలి

పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలకు చెందిన రికార్డులను అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పాఠశాల నిర్వహణకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవన్న కారణంగా పాఠశాలని సీజ్ చేసిన విషయం విదితమే. అయితే ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులకు తరువాత విద్యాభ్యాసం దృష్ట్యా టిసిసిసిలు మంజూరు చేసే క్రమంలో గురువారం సీజ్ చేసిన పాఠశాల తలుపులను తెరిచారు. విద్యార్థులకు అవసరమైన టిసిసిసి వంటి ముఖ్యమైన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్, ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి, రెవెన్యూ తరుపున విఆర్ఒ యుగంధర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి నిర్మల

మధ్యవర్తిత్వంపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి

కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఇరుపార్టీల మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకుని వారి ద్వారానే కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జిల్లా శాఖ ఆదేశాల మేరకు జూలై నెల నుంచి 90 రోజుల పాటు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు. వివాహానికి సంబంధించిన, గృహహింస, చెక్‌బౌన్స్, సివిల్ కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. సమావేశంలో న్యాయవాదులు దివ్వల వివేకానంద, సంపతరావు, దివాకర్, అంపోలు వైకుంఠరావు, దుంపల భుజంగరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న అన్వేష్

ఘనంగా క్రైస్తవ దినోత్సవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త ప్రత్తి విజయకుమార్ షాపు వద్ద గురువారం క్రైస్తవ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తి అన్వేష్ ఆధ్వర్యాన క్రైస్తవ దినోత్సవం సందర్భంగా నిరుపేదలకు 50 మందికి నెలసరిపడే రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కిడ్నీ రోగులకు ఆర్థికసాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కొత్తపల్లి అబ్రహం, వి వి.జాన్‌సన్, డి ఏలీయా క్రైస్తవ దినోత్సవం గురించి వివరించారు. క్రైస్తవ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేసిన పలు సేవా కార్యక్రమాలపై పలువురు అభినందించారు. కార్యక్రమంలో బిమ్మో బెహరా, బెనర్జీ, సుందర్, హరికృష్ణ, నందిగాం కోటి, కొర్రయి ధర్మరాజు, ప్రసాద్ ఆచారి పాల్గొన్నారు.

సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆర్మీ ఉద్యోగికి సన్మానం

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన పోతనపల్లి జగదీశ్వరరావు ఆర్మీలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు గురువారం స్వగ్రామానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. 24 ఏళ్ల ఆర్మీలో పనిచేస్తూ దేశ సేవకు అంకితమయ్యారు. ఈ సందర్భంగా ఆర్మీ ఉద్యోగి జగదీశ్వరరావు మాట్లాడుతూ తనకు గ్రామస్తులు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆర్మీ ఉద్యోగంలో ఉన్నప్పుడు దేశ సేవ కోసం విధులు నిర్వర్తించగా... ఇప్పటి నుంచి సమాజం, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిక్కర ఢిల్లీరావు, సర్పంచ్ తామడ మదన్, బొడ్డు సింహాద్రి, బుడత ధనరాజ్, పోతనపల్లి గీతమ్మ, బొడ్డు భువనేశ్వరి, పి. తాతారావు, కుసుమ హరినాథ్, బొడ్డు దుష్యంత్ పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని వెంకటాపురం కూడలిలో అదే గ్రామానికి చెందిన సూరి ధర్మారావు 11 మద్యం సీసాలతో వెళ్తుండగా లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు పట్టుకొని అరెస్టు చేసి కేసునమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం తరలించినా అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

మరొకరికి గాయాలు

లక్ష్మణరావు (ఫైల్)

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని ఐదో వార్డు పరిధిలోని టిజెఆర్ నగర్‌లో విద్యుత్ షాక్ తగిలి భవన నిర్మాణ కార్మికుడు గేదెల లక్ష్మణరావు (49) మృతి చెందగా మరో కార్మికుడు మురపాక రమణ గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం లావేరు మండలం చిన మురపాక గ్రామానికి చెందిన గేదెల లక్ష్మణరావు టిజెఆర్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న తన సమీప బంధువు ఇంటి నిర్మాణ పనికి వచ్చాడు. ఇంటి నిర్మాణ పని చేస్తుండగా మేడపై ఇనుప గజాలు పైకిఎత్తే సమయంలో విద్యుత్ ప్రధాన వైర్ల నుంచి వచ్చే ఇండక్షన్ తగిలి విద్యుత్ షాక్‌కు గురై లక్ష్మణరావు మృతి చెందగా పక్కనే ఉన్న మురపాక రమణ గాయాల పాలయ్యాడు. గాయాలపాయలైన రమణను హుటాహుటిన జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు లక్ష్మణరావుకు భార్య అసిరి తల్లి, కుమారులు భాస్కరరావు, బాలరాజు ఉన్నారు. మృత దేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమి త్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి

పలాస: పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ దేవ లక్ష్మణమూర్తి (60) బుధవారం రాత్రి అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. స్థానిక మున్సిపల్ రెండో పాలక మండలిలో కోట్ని లక్ష్మి చైర్‌పర్సన్ హయాంలో స్వతంత్ర కౌన్సిలర్‌గా లక్ష్మణ మూర్తి ప్రాతినిధ్యం వహించారు. విషయం తెలుసుకున్న బంధుమిత్రులు, వ్యాపారులు అంత్రియలు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తన సంతాపాన్ని తెలియజేశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎఇపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బోర కృష్ణారెడ్డి, మీసాల సురేష్, కో-ఆప్షన్ సభ్యులు సుజాత గౌరీ త్యాడి, కౌన్సిలర్లు ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

సినీ ఫక్కీలో చోరీ

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలోని ఇండియన్ బ్యాంకు వద్ద గురువారం పట్టపగలు సినీ ఫక్కీలో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొచ్చెర్ల గ్రామానికి చెందిన మహిళలు పదిమందికి పొదుపు డబ్బులు సుమారు రూ. 20లక్షలు మంజూరైంది. మహిళల ఒదరూ బ్యాంకుకు వచ్చి డబ్బులు డ్రా చేసు కున్నారు. డబ్బులు పంచుకుని ఎవరికి వచ్చిన డబ్బులు వారు బ్యాగుల్లో పెట్టుకుని బ్యాంకు ముందు నిలబడి మాట్లాడుతున్న సమయంలో ముగ్గురు గుర్తుతెలియని మహిళలు బ్యాంకు పనిమీద వచ్చినట్లు వచ్చి ఈ పదిమంది మహిళల మధ్యలో దూరి బస్వ గుర్రమ్మ, లంకలపల్లి మాధురి బ్యాగులు కత్తిరించి చెరో బ్యాగులో నుంచి రూ.50 వేలు చొప్పున రూ.లక్ష చోరీకి పాల్పడ్డారు. మహిళలంతా జె.ఆర్. పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

కొచ్చర్ల మహిళలు, ఇన్‌సెట్‌లో కత్తిరించిన బ్యాగ్

ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు తప్పనిసరి

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా వ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లకు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు, మత సంస్థలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు వారం రోజుల ముందుగా ఆ ప్రాంత పరిధిలో పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకి వివరాలు, సమాచారం అందించాలన్నారు. పోలీస్ సబ్ డివిజనల్ అధికారి నిర్దేశించిన అనుమతులను ముందుస్తుగా తప్పనిసరిగా ఉండాలన్నారు. దరఖాస్తు చేసునే వ్యక్తుల వివరాలు, ఎందుకు నిర్వహిస్తున్నారు, ఎంతమంది వస్తున్నారు, ప్రారంభ సమయం, ముగింపు సమయం, రూట్, స్థలం ఇలా పలు వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రజా సమస్యతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలతో ఎచ్చెర్ల నియోజకవర్గం నడిపించేందుకు కృషి చేస్తున్నానని, ప్రజలు అందుకు సహకరించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని అల్లివలసలో నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు. ప్రజా సమస్యలపై చర్చించి సమస్యలు పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. ఈనెల 7న ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ముందస్తుగా అల్లివలస గ్రామ యువత బ్లడ్ డొనేషన్ క్యాంప్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ యువత, పెద్దలు ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జీవన్ జ్యోతి పథకం రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీ నాయుడు, బస్వ గోవింద్ రెడ్డి, లంక ప్రభ, బాలి శ్రీను, శ్రీనివాసరావు, మహంతి ఆనంత్, అల్లివలస నాయకులు, యువత, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అరసవల్లి 11 కెవి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇఇ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనతో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. అరసవల్లి, కలెక్టరేట్, 80 అడుగుల రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నందిగాం : మండలంలోని నందిగాం సబ్‌స్టేషన్ పరిధిలోని లట్టిగాం ఫీడర్, నందిగాం ఇండస్ట్రీలు ఫడర్‌కు శుక్రవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఇఇ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. హరిదాసుపురం, సుభద్రాపురం, కృష్ణరాయపురం, మాదిగాపురం కామధేనువు, పాలవలస, తామరపల్లి గొల్లవూరు, శాసనం, నర్సిపురం, దిమిలాడ, లక్కీదాసుపురం, బూరగాం, లచ్చన్నపేట, మాకవరం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహిళలు పారిశ్రామికవేత్తలు కావాలి

మున్సిపల్ కమిషనర్ రామారావు

పలాస: ప్రతి కుటుంబమూ ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదంతో పట్టణ ప్రాంతాలలోని మహిళలతో కలిసి సంఘాల ఏర్పాటు చేసి డిజి లక్ష్మి ఆటోమ్ కిసాక్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పేద, నిరుపేద మహిళలను గుర్తించి వారితో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి, బ్యాంకుల్లో అకౌంట్లను ప్రారంభించి, నెలనెలా పొదుపు చేసి, వారికి చిన్నచిన్న అప్పులు ఇచ్చి వారిని నుంచి డబ్బులు వసూళ్లు చేసి ఆ సంఘాలను బలోపేతం చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పలాస-మున్సిపల్ కమిషనర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం హెల్త్ కార్యదర్శులు, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులపై సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా సిబ్బంది ప్రజలను చైతన్యవంతులను చేసి, ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు.

విత్తన గుళికలు ప్రకృతి వ్యవసాయానికి మేలు

కవిటి: వాతావరణ మార్పులు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో రైతులను ప్రకృతి వ్యవసాయపు పద్ధతుల వైపు దారితీసే ప్రయత్నం గట్టిగా సాగుతోంది. మండలంలోని గొర్లెపాడు యూనిట్ ఖాజూరులో ఈరోజు నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో విత్తన గుళికల తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంటి సంజీవరావు, డిఎంఎంటి తులాశయ్య రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం తీవ్ర ఎండల కారణంగా భూమి తాకిడికి గురవుతుందని దీనికి ప్రత్యామ్నాయంగా 365 రోజులు భూమిని కప్పి ఉంచే ప్రక్రియలో భాగంగా పిఎండిఎస్ పద్ధతి పాటించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు వరి నాటే సమయాన్ని జూలై, ఆగస్టుల మధ్యగా ఎంచుకుంటారు. ఐసిఆర్‌పిలు స్వాతి, శ్రీదేవి, సంతోషి పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

లావేరు: మండలంలోని ఉపాధిహామీ పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 29.29 కోట్లతో చేపట్టిన ఉపాధిహామీ పనులకు జులై 4 నుంచి 19 వరకు గ్రామాల్లో చేపట్టిన పనులకుగాను 18వ విడత సామాజిక తనిఖీలు పారదర్శకంగా ఉండాలని ఎంపిడిఒ పి.వెంకటరాజు అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ బృందాలు, అధికారులు, ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఆర్‌పిలు బండారు సూర్య నారాయణ, సిహెచ్ రామచంద్రుడు, ఎపిఒ రెడ్డి సత్యవతి, పిఆర్ ఎఇ శ్రీవల్లి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరాజు

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని టి.జొన్నవలసలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ పరిపాలన వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అధిక విద్యుత్ ఇతర కారణాల వలన పథకాలు అందడం లేదని, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమినేని చంద్రశేఖర్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, దూసి నీటి సంఘం అధ్యక్షులు హనుమంతు బాలకృష్ణ, నాగళ్ల మురళీధర్ యాదవ్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: నగర్ కార్పొరేషన్ పరిధి బలగ 10 వార్డులో సుపరి పానలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధిని వివరించారు.

అలాగే అరసవిల్లిలో సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నగర టిడిపి బిసిసెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి, యువ నాయుకులు రాయపిల్లి అర్జున్‌తో కూడిన నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వ విజయాలను వివరించారు.

లావేరు: సిఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ అన్నారు. కొత్తకుంకాం పంచాయతీ పైడాయవలసలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధానకార్యదర్శి పిన్నింటి మధుబాబు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, క్లస్టర్ ఇన్‌ఛార్జి గొర్లె శ్రీనువాసరావు, స్థానిక నాయకులు కోలా నారాయణరావు, పళ్ళంట్ల చిట్టిబాబు, మాజీ సర్పంచ్ గొల్లరావు, మాకన శంకరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలకు తమ పాలనను ప్రత్యక్షంగా వివరించే లక్ష్యంతో ప్రారంభించిన 'తొలి అడుగు' కార్యక్రమం మండలంలోని నెలవంకలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ స్వయంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజల పక్షాన ప్రభుత్వం చేసిన పనులు, ఇంకా ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై మాట్లాడిన ఆయన గత పాలకుల వైఫల్యాలపై తీవ్ర విమర్శలు చేస్తూనే ప్రస్తుత పాలనలో జరుగుతున్న మార్పులను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి దిశ, దశలు ఇచ్చారు. మునుపటి పాలకులు మాత్రం రాష్ట్రాన్ని అధోగతిలోకి నెట్టారు. ఒక్క అవకాశం ఇచ్చిన ప్రజలను మోసం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, మణిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, బాసుదేవ్ ప్రధాన్, బార్ల చినబాబు, లోళ్ల శ్రీను, బెందాళం తిరుమలకుమార్, శ్రీనివాస రౌళో, పుల్లట రాజు, రెయ్యి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నరసన్నపేట : పట్టణంలో 17వ వార్డులో గాంధీనగర్ 3,4 వీధులు, విలేకర్ కాలనీ, కోవెల వీధుల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నియోజవర్గ అబ్జర్వర్ కోయిలాడ వెంకటేష్ పాల్గొన్నారు.

అలాగే మండలంలోని కోదడ్డపనసలో ధర్మాన తేజ్‌కుమార్ ఆధ్వర్యాన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోర ధర్మారావు, టిడిపి మండల అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, సాధు చిన్నికృష్ణంనాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని డొంకూరులో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అధ్యక్షులు లోపింటి పద్మనాభం, మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, ప్రధాన కార్యదర్శి దక్కత కామేష్, మెరుగు సూర్యనారాయణ, బాబ్జి, దున్న లోకనాథం, చీకటి సూర్యనారాయణ, దున్న కూర్మారావు, శివంగి గణపతి, జనసేన మండల నాయకులు చీకటి కృష్ణయ్య పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో నాలుగో వార్డు టిడిపి పట్టణ అధ్యక్షుడు పత్రీ తవితయ్య, ప్రధాన కార్యదర్శి నందిగాం కోటి, కార్యదర్శి సాలీనా ఢిల్లీ, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు లీలారాణి, కాళ్ల దిలీప్‌కుమార్, యూత్ ప్రెసిడెంట్ ఆసి ధర్మరాజురెడ్డి, రామారావు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బొడ్డపాడులో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు కిక్కిర ఢిల్లీరావు, క్లష్టర్ ఇన్‌ఛార్జి మురుపింటి కుమార్‌రాజ్, బొడ్డు దుష్యంత్, బొడ్డు జగన్, గర్తం కృష్ణమూర్తి, బుడత విప్లవ్ కుమార్, నాయుడు మోహనరావు పాల్గొన్నారు.

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 3 వార్డులో టిడిపి బిసి సెల్ కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, మాజీ కౌన్సిలర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి సవర రాంబాబు, మాజీ కౌన్సిలర్ కొండే నర్సింహులు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

ఆమదాలవలస : సుపరిపాలన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

కొత్తూరు : మండలంలోని కడుమలో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బుద్ధ త్రినాథరావు, వైస్ ఎంపిపి లోతు గెడ్డ, తులసీ వరప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, టిడిపి నాయకులు అరుణ్‌కుమార్, ఎంపిటిసి గోవిందరావు, మాతల గాంధీ, దశరథరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని జాడేపల్లిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇంటింటికీ వెళ్లి అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రవ్వల గణపతిరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలం పూడివలస గ్రామంలో ఇంటింటికి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి పూర్వపు అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి, ఎచ్చెర్ల మండల టిడిపి అధ్యక్షులు బెండు మల్లేశ్వరరావు, కూటమి నాయకులు గాలి వెంకట్ రెడ్డి, అన్నెపు భువనేశ్వరరావు, వావులపల్లి రామకృష్ణ, పైడి నూకరాజు, పైడి అన్నం నాయుడు, బచ్చు కోటిరెడ్డి, గాడు రామారావు, గొలివి గోవింద, నారాయణస్వామి, రామస్వామి, వెంకన్న, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

సమాజ సేవకు అంకితం

ప్రజాశక్తి- పలాస

యువకులు సమాజ సేవకు అంకితం కావాలని పలాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. కళాశాలలో గురువారం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు అలవాట్లు సమాజానికి అనుగుణంగా మార్చుకోవాలని సూచించారు. చెడు స్నేహితులతో దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల జోలికి పోవద్దు సూచించారు. యువత సమాజంపై చూపే ప్రభావం, సామాజిక మార్పు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి, రాజకీయ సామాజిక ఉద్యమాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు పి.వెంకటరమణ, ఎం.శ్రీనివాస్ పట్నాయక్, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వనాథపురంలో 'పొలం పిలుస్తోంది'

కోటబొమ్మాళి: వరి సాగులో కలుపు నివారణ పద్ధతులు పాటించాలని ఎఒ ఎస్.గోవిందరావు అన్నారు. గురువారం మండలంలోగల విశ్వనాథపురం సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటకంటే ఎక్కువ ఆదాయం వచ్చే ఆయిల్ పామ్, అంతర పంటగా కొకొయి పంటలు వేసుకోవాలని రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పిచారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

తాపీమేస్త్రికి ఆర్థికసాయం

సంతబొమ్మాళి : మండలంలోని మరువాడ పంచాయతీ చొక్కరవానిపేటకు చెందిన తాపీమేస్త్రీ మోగి రాజు కుటుంబానికి కెపి స్పందన ఫౌండేషన్ గురువారం రూ.పది వేలు ఆర్థికసాయం అందించింది. నిరుపేద కుటుంబానికి చెందిన రాజు ఇటీవల పనిచేసుకుంటూ ప్రమాదానికి గురై వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతుండడంతో స్పందన ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు షణ్ముఖ మాస్టర్, నరసాపురం సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి, సూరాడ జోగారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్లాస్టిక్ పర్యావరణానికి పెనుముప్పు కలిగిస్తుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధిద్దాం, ఆరోగ్యవంతమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని నిర్మిద్దాం. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తే తప్పక విజయం సాధించగలమని హర్షవల్లి లయన్స్ సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ ప్లాస్టిక్ సంచుల నిరోధ దినోత్సవం సందర్భంగా హర్షవల్లి లయన్స్ క్లబ్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలో కృష్ణాపార్క్ జంక్షన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుందర శ్రీకాకుళం, కాలుష్య రహిత శ్రీకాకుళంగా మారాలన్నారు. 2023లో హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఇచ్చిన పిలుపు మేరకు ఇప్పటి అభిరుచి డిపార్ట్మెంట్ స్టోర్‌లో ఇప్పటికీ క్లాత్ బ్యాగులను వినియోగిస్తున్నందుకు ఆ షాపు యజమాని తంగుడు అమితేష్‌ను సభ్యులు అభినందించారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ సభ్యులు ఈ సందర్భంగా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌ను పట్టణంలో పౌరులకు, అన్ని వాణిజ్య సముదాయాలకు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్‌లో పర్యావరణహితం కోసం ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలకు సహకరించాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్మన్ హారికా ప్రసాద్, ప్రెసిడెంట్ డాక్టర్ మేడిశెట్టి సత్య స్వరూప్, పూర్వాధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథ నాయుడు, రీజియన్ చైర్‌పర్సన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు తర్లాడ అప్పల నాయుడు, కార్యదర్శి లక్ష్మణరావు, ట్రెజరర్ పార్వతీశ్వరరావు, మణిశర్మ, మీసాల మాధవి, బాలాజీ, కార్యవర్గసభ్యులు సుమన్, నిహార్ తదితరులు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగులను పంపిణీ చేస్తున్న హారికాప్రసాద్

జూదరుల అరెస్టు

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం, సలంత్రి గ్రామాలకు చెందిన పేకాట ఆడుతున్న 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. గురువారం శ్రీకాకుళం టాస్క్ ఫోర్స్ పోలీస్ జరిపిన దాడుల్లో షలంత్రి గ్రామ చెత్త సంపద కేంద్రం వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4,570 నగదు, రెండుఫోన్లు స్వాధీన పరచుకొని కేసు నమోదు చేశారు. అలాగే పురుషోత్తపురం గ్రామ వంశధార నది ప్రాంత జీడితోటల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.16,040 నగదు, ఐదుఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆమదాలవలస మండలం కొర్లకోటలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6080 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎఒ ఉషారాణి

కాలువలు ఇలా... సాగునీరు ఎలా?

కాలువలో పేరుకుపోయిన పూడికలు

ప్రజాశక్తి- టెక్కలి

వంశధార మెయిన్ కెనాల్ నుంచి సాగునీరు విడిచిపెట్టిన క్రమంలో టెక్కలి మండలంలో కాలువల్లో సాగునీరు ప్రవాహం ప్రశ్నార్థకంగా మారుతుంది. మెయిన్ కెనాల్ నుంచి చిన్నపాటి కాలువలు అనేకం ఉన్నాయి. వాటిలో పూడికతీత పనులు పూర్తికాలేదు. వేసవి కాలంలో పూర్తి కావాల్సిన పనులు ఆ సీజన్‌లో చేపట్టకపోవడంతో ప్రస్తుతం కాలువల ద్వారా సాగునీరు ప్రవాహం కష్టంగా మారుతుంది. ఇటువంటి నేపథ్యంలో ప్రస్తుత ఖరీఫ్‌కు సాగునీరు ఏ విధంగా అందుతుందో తెలియని పరిస్థితి. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నియోజకవర్గంలో వంశధార మెయిన్ కెనాల్, చిన్నపాటి కాలువల్లో కూడా పూడికతీత పనులు చేపట్టలేదు. ంశధార మెయిన్ కెనాల్‌కు సంబంధించి ఆయుకట్టు వివరాలు పరిశీలిస్తే... టెక్కలి మండలంలో 8,395 ఎకరాలు, కోటబొమ్మాళి మండలంలో 7,950 ఎకరాలు, సంతబొమ్మాళి మండలంలో 17,797 ఎకరాలు, నందిగాం మండలంలో పది వేల ఎకరాలు వంశధార ఆయుకట్టుపై ఆధారపడి ఉన్నాయి. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో వంశధార నీరు విడిచిపెట్టడం వల్ల ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుంది.

అందుబాటులో ఎరువులు

బూర్జ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచడం జరిగిందని మండల ఎఒ డి.ఉషారాణి గురువారం తెలిపారు. 300 మెట్రిక్ టన్నుల యూరియా, 300 మెట్రిక్ టన్నుల డిఎపి ఇండెంట్ పంపించగా ఇంతవరకు 200 మెట్రిక్ టన్నుల డిఎపితో పాటు 75 మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంచేందుకు వీలుగా మండలంలో ఉన్న అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉంచడం జరుగుతుందని తెలిపారు. పటాస్ ఇంకా ఇండెంట్ పంపించలేదని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక సర్పంచ్ వేగు అనురాధ, ఎంపిటిసి చొక్కర పోలునాయుడు, నీటి సంఘాల అధ్యక్షులు వేపారి తవిటమ్మ, లింగపల్లి అప్పల సూర్యనారాయణ, విజ్ఞాన రాజు చౌదరి, విఆర్ఒ అప్పల నాయుడు, విలేజ్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ వసంత పాల్గొన్నారు.

భూముల ధరలకు రెక్కలు

పెరిగిన భూ వివాదాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో పలు గ్రామాల్లో భూముల వివాదాలు చోటుచేసుకున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా భూముల ధరలకు ప్రస్తుతం విపరీతమైన ధరల పెరిగి పోవడంతో వివాదాలు కారణం అవుతుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గురువారం మండలంలోని పెద్దపేట, పాలవలస, అల్లెన గ్రామాల్లో భూముల విషయమై వివాదం తలెత్తడంతో రెవెన్యూ అధికారులతో పాటు పోలీస్ అధికారులు రంగంలోకి ప్రవేశించారు. పాలవలసలో భూముల సమస్యపై కొంతమంది వ్యక్తులు తమ భూములు తమకు అప్పగించాలని శ్రీకాకుళం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయడంతో గురువారం డిప్యూటీ తహశీల్దార్ సత్యవతి గ్రామానికి చేరుకుని భూముల వివాదంపై విచారణ చేపట్టారు. అలాగే పెద్దపేట పంచాయతీ పరిధిలో ఉన్న భూములకు సంబంధించి కుటుంబ సభ్యుల్లో నెలకొన్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ప్రవల్లిక తన సిబ్బందితో పెద్దపెట గ్రామానికి చేరుకుని భూమి వివాదంపై ఇరు వర్గాల కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యను పరిశీలించారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో అన్ని ప్రాంతాల్లోనూ వివిధ సమస్యలు తలెత్తుతున్నాయని మండల ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొల్లివలస, ఉప్పినవలస, అన్నంపేట, పెట్టపేట, పాలవలస, అల్లెన తదితర గ్రామాల్లో భూ వివాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఏదిఏమైనా భూముల కొనుగోలు విక్రయాల్లో ప్రతి ఒక్కరు పత్రాలను నిశితంగా పరిశీలన జరిపి అనంతరం ఇతర వ్యవహారాలను పూర్తి చేసుకుంటే సమస్యలు ఉత్పన్నం అవ్వవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సిరిమాను సంబరాలు విజయవంతం

శ్రీకాకుళం సిటీ: పాత శ్రీకాకుళం సిరిమాను కమిటీ సభ్యులు గురువారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డిలను కలిశారు. సిరిమాను ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్, ఎస్‌పిలను పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సిరిమాను సంబరాలు సజావుగా ముగిశాయన్నారన్నారు. కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కమిటీ అధ్యక్షుడు డిపి దేవ్, ముఖ్య సలహాదారు రామలింగేశ్వర స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శంకరరావు, కార్యదర్శి మావూరు శేఖర్, కల్లేపల్లి సోంబాబు, క్రి రంగాజీ దేవ్, అదపాక రాంబాబు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

మెళియాపుట్టి: సామూహిక గొర్రెలు మరియు మేకల నట్టల నివారణ మందుల పంపిణీని గొర్రెల, మేకల పెంపకం దారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు పిలుపునిచ్చారు. మండలంలో పెద్దలక్ష్మీపురంలో నిర్వహిస్తున్న డీ వార్మింగ్ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు.

బ్యాంకు బీమా పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

బ్యాంకులలో అమలవుతున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని పొన్నంపేటలో జనసురక్ష ఫైనాన్షియల్ ఇన్ క్లూజన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జులై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జరుగుతున్న గ్రామస్థాయి జనసురక్ష ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కార్యక్రమాలు జిల్లాలోని 917 గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ సమాచారం ప్రజలకు చేరాలన్న లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాలను యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో, ఎస్.ఎస్.టి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల వలన కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి 1930 అలాగే ఇన్సూరెన్స్‌ల ఫిర్యాదుల కోసం 14448 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ కె.ఉమాశంకర్, వెలుగు ఎపిఎం గురుగుబెల్లి నారాయణరావు, జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సి సువ్వారి రవిబాబు, సిఎఫ్ఎల్ కౌన్సిలర్స్ చిగురుపల్లి వెంకటేష్, బొడ్డేపల్లి చంద్రశేఖర్, సిఎఫ్ఎల్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వివరిస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు